

# మధ్యారకం

[కథానిక]

శ్రీ వి. డి. ప్రసాదరావు

చెరువుగట్టంబడే చుట్టూ తిరిగి మళ్ళీ ఇంటికే పోదామనుకుంటున్నాడు. పొద్దు పూర్తిగా వాలలేదు. ఆ పల్లెటూళ్లో వాళ్ళింటికెళ్ళినా, ఏమీ తోచేటట్టు లేదు. అక్కయ్యమాట తీసేయలేకా, సెలవులకు అమ్మా నాన్నాదగ్గిరే కాకుండా ఎక్కడికన్నా వెళ్లాలన్న ఉబలాటంవల్లా ఆ పల్లెటూరు వచ్చాడు. పొద్దున్నే బావ ఊళ్లోకి పోయాడు. అక్కయ్యతో కాసేపు మాట్లాడాడుగాని, ఎంతసేపటికీ పొద్దుపోయినట్టే కనబడలేదు. వీధి అరుగుమీద చాప లేదు. అలికి ముగ్గులెట్టి శుభ్రంగా ఉన్నా తెచ్చుకొన్న రెండు తెల్లలాగూలూ మాసిపోతాయేమోనని కూలబడలేక ఒక చింకిరిచదర వేసుకొని కాసేపు కూర్చొన్నాడు. నేలమీదకంటే చదరమీదే ఎక్కువ మట్టి ఉంది. గేదెలను తోలుకొంటూ బుడ్డపంచె కట్టుకొని, కాపుకుర్రాడు చుట్టముక్క పీల్చుకొంటూ కర్ర బుజాన్ని అడ్డంగా రెండు చేతుల వెనక్కి పట్టుకొని, చుట్ట నోట్లోంచి తియ్యకుండా, వింతమృగాన్ని చూస్తున్నట్టు చూసి, "ఏ ఊరూ?" అని ప్రశ్న పారేశాడు. కాపు కుర్రాడికి తల సగంపాయ్య కొట్టించినట్లుండి వెనకపిలక గాలికి ఎగురుతూంది. ఆ కుర్రాడితో మాట్లాడడానికి కూడా నిస్నాకారం తోచి, ఆ కుర్రాడి నిర్లక్ష్యానికి తన నిరసన మౌనంతో జవాబిచ్చుకొని తృప్తిపడ్డాడు.

"ఉలకడేం" అని వెగటునవ్వు నవ్వి గేదెలకుర్రాడు ముందుకు సాగిపోయాడు.

ఆ తర్వాత ఇంకేకుర్రాళ్ళనీ పలకరించలేక సాయంత్రందాకా ఇంటిపట్టున గోళ్ళుగిల్లుకుంటూ కూర్చుని, సాయంత్రం చెరువుగట్టుకే బయలుదేరాడు. ఒక్కరోజుకే విసుగెత్తుతూంది. అక్కడక్కడ తన యీడు కుర్రాళ్ళు కనబడ్డా, చొక్కాలేని రకాలేతప్ప తను మాట్లాడించతగ్గ అర్హత ఉన్నవాడొకడూ కనబడలేదు.

"ఒహోయ్".

ఇందాకా పలకరించిన కుర్రాడూ, మరి నలుగురు తన ఈడు వాళ్ళూ పంటబోదె కావతల కూర్చుని పులిజూదం ఆడుకొంటున్నారు. బోదెకాలవ అంత పెద్దది కాకపోయినా నడుందాకా దిగబడే నీళ్లూ బురదా ఉన్నాయి. ఒక్కటే తాటిపట్టె ఒకచోట ఇటునుంచి అటుకు ఉందిగాని, బురద జారుడుగానే ఉన్నట్లుంది.

అటూఇటూ పోటానికి తోచక అక్కడే వాళ్ళను చూస్తూ నిలబడ్డాడు.

"నులుసుండాయేం, తాటిపట్టమీంచిటు రా."

"కాలు జార్తాదేస్"అంటూ ఇంకొకడు వెటకారంగా అందర్నీ నవ్వించాడు.

పైకి పౌరుషంగా, లోపల వణుకుతూనే తాటిపట్టెమీద బయలుదేరాడు. చివరికొచ్చాక కాలు జారింది. బిగిసిన బురదలో జారేలోపల ఒకకుర్రాడు ముందుకొచ్చి చెయ్యి ఆసరాయిచ్చి సులువుగా గట్టుకు లాగాడు.

"ఏఊరంటే ఇందాకా పలికావుకావేం"అన్నాడు మొదటి కుర్రాడు.

పదిఏళ్ళ యీడున ఉన్న నల్గురు సాటికుర్రాళ్లతోనూ, ఎంత విభేదమనిపించినా, ఎంత తనకు తక్కువనిపించినా, మాట్లాడకుండా కలవకుండా, ఎంతోసేపు బిగబట్టుకు కూర్చోటం సాధ్యంకాదు.

"బస్తీనుంచా! ఏం సదూతుండావ్ ?"

"ఫిఫ్త్ స్టాండర్డు"

"అంటే"

ఈ అజ్ఞానులముందర మళ్ళీ గర్వం సంతోషంగా తలచూపింది. ఒక ఏడాది ఎక్కువేసి ఆరోక్లాసన్నాడు.

తనకు చెయ్యందిచ్చిన కుర్రాడు జునపాలజుట్టూ, నవ్వుమొగంతో "నన్నూ పైయేడు ఫస్టుఫారంలో ఏయిత్తానన్నాడు తమ్మన్నగారు మానాన్నతో. ఇనస్పేటరు ఒచ్చినప్పుడు కోతల్లో ఉంటే మా నాన్నను పిలిసి ఆరేల నన్ను బడికంపమన్నాడు. పైయేడు బస్తీలో ఫస్టుఫారంలో చేర్పిస్తానంటే నాన్న కాళ పుట్టింది. బస్తీ పంపిస్తానన్నాడు."

తక్కినవాళ్ళకంటే ఆకుర్రాడు కొంచెం దగ్గిరనిపించాడు.

"తమ్మన్నగారు మాశావే. ఆయనకు బడిఉందా ?"

"నీకే తెల్దా! ఎల్లా తెలుస్తుంది లే, ఏడాదికి మొత్తం రోజులన్నీ కలిపి ఓనెల ముమ్మల్ని బడికి తోలుకెళ్తాడు. ఇవన్నీటను వచ్చినపుడు హంగామా సేస్తాడు. అందరం సేపేగా!"

"రంగా! మనమిని పెంటు చదివి అప్పుడే అయిదేళ్ళయింద్రి గాదురా!"

జనపాలకుఱ్ఱాడు నవ్వి "ఆ"అన్నాడు.

కబుర్లలోంచి తిండిమీదికి ఏవబడ్డది. "ఒరేయ్, తోపులో మామిడికాయలు కోసుకొందారి పదండ్రా. నాగయ్యా, సాంబారు కారం తెచ్చావా?"

వాళ్ళంతా నాల్గెక్కతోంటే చేతకాక క్రిందే నిలబడి పోయాడు.

కాయలు తింటంలోగూడా వాళ్ళకు లొచ్చయిపోయాడు. కారం నోరుమండించి గుక్క ఎక్కబడేస్తూంది. ఊరికే తింటానికి పళ్ళు పులిసిపోతున్నాయి. వాళ్ళు రెండువిధాలా సునాయాసంగా తినేయగల్గుతున్నారు.

రంగడు ఇతని కవళిక కనిపెట్టి, "నోరు మండుతూందా?" అన్నాడు.

"చెరువులో నీళ్ళు లేనట్టున్నాయే?" అని బిక్కమొగంతో అడిగాడు.

"ఇయితిని నీళ్ళు తాగకూడదు. అప్పన్నా, కత్తి తెచ్చావురా, రెండు గెలలు కోద్దాం."

రంగడు తాటి చెట్టెక్కి ముంజెలు కోసి ఇస్తున్నాడు.

పిలకకుఱ్ఱాడు ఎగతాళిగా "ఆతల సెట్టెక్కతావా? సిన్నదేగా" అన్నాడు.

ఉడుకుమోతుతనంతో మాటరాలేదు.

ముంజెకాయ తను ఒకకన్ను తినేలోపల వాళ్ళు రెండురెండు కాయలు లాగేస్తున్నారు.

నీళ్ళు నోట్లోకిరాకుండా పెదవులనిండా అంటుకొంటూ బుగ్గల నిండా జిగురు అంటుకూంది.

"అల్లా కాదు తినేది" అని చిరునవ్వుతో రంగడు బొటన వేలూ, నోరూకలిపి ముంజెలు తింటానికి ఉపయోగించాల్సిన వీలు నేర్పాడు. రెండుమూడు కాయలుమించి తినలేకపోయాడు.

బావ ఇంకెవరితోనో ఆదోవనే ఇంటికి వస్తున్నాడు.

పిల్లలలో గౌరవం రాకపోయినా, బావతో వస్తూన్న పెద్ద ఆసామీలు తమ్మన్నగారి బావమరిదిని, బస్తీకుఱ్ఱాడిని మన్ననగా చూచి, తమ పిల్లలకు "వాణ్ని చూసి బుద్ధి తెచ్చుకోండిరా" అంటంలో తన మనస్సుకు మళ్ళీ కొంచెం స్థాయిచిక్కి తన ప్రతిష్ఠ తనకు నిల్చినట్లుంది.

౨

స్కూళ్ళు తెరిచారు. క్లాసులో చివరి బెంచీలో కిటికీ దగ్గరిగా ఉన్న జనపాలు ముడిగా పేర్చుకొని, కాలిని తెల్లకంటె, ములకలాగూ చొక్కాలు, చెవిపోగులతో రంగడు కూర్చుని ఉన్నాడు. "సత్యం!"అని ముందు బెంచీలో ఉన్న తనను కేక వేశాడు.

స్కూళ్ళు తెరిచి మొదటిగంటకూ మూడోగంటకూమధ్య సమయం. క్లాసంతా గింగిరిలెత్తుతూ అల్లరిగా ఉంది. తనపక్క ఉన్న కుఱ్ఱాళ్ళు పల్లెటూరి రంగణ్ణి వెటకారం మొదలుపెట్టారు. వెనక బెంచీలవాళ్ళకా ఒకటే అల్లరి పాకింది. తమ రంగణ్ణి ఏడిపిస్తున్నట్టు చిరునవ్వు నవ్వటానికికూడా గుండె చాలలేదు.

రంగడు మొగం ముడుచుకొని కుంచుకుపోయాడు. ఆ నాడు పల్లెటూళ్లో ఈ కుఱ్ఱాడికి లొచ్చయానన్న ఉక్రోషం ఏమైనా మిగిలి ఉండి ప్రేరేపించేదేమో-తెలియకుండానో, తక్కిన కుఱ్ఱాళ్ళు అల్లరి చేస్తూంటే, ఎదురు నడవటానికి ధైర్యం చాలకనో తనూ వాళ్ళతో పాటే అయాడు.

మూడోగంటతో రంగడికి కొద్ది పీక తగ్గిందికాని, ఆ బస్తీ మాస్టరుకూడా తన తెలివితేటలన్నీ రంగడిమీదే ఒలకపోసుకొని కుఱ్ఱాళ్ళ అభిమానం సంపాదించుకొన్నాడు.

ఆనాడు పల్లెటి కుఱ్ఱాళ్ళందరిలోకీ తనయందు సుహృద్భావం చూపించింది రంగడేనని మనస్సు కెలకేసింది. సాయంత్రం రంగణ్ణి ఒంటరిగా పలకరించాడు. రంగడిని తను ముందు చూడలేదనే, అల్లరి చేసినవాళ్ళల్లో తను లేననే అబద్ధపు సాకులు చెప్పుకొన్నాడు. రంగడికి నదిలో మునుగుతుంటే గడ్డిపరక అందినట్లయి, ఇందాకా ఆగడ్డిపరకకూడా తన్ను తోసేసిందన్నమాట మరిచిపోయి, పసిగుండెలో కల స్నేహవాంఛతో నిర్మలినంగా పొత్తుకలుపుకొన్నాడు. ఆ కుఱ్ఱాళ్ళమధ్య ఎల్లాఎల్లా ఉండాలో అన్నీ రంగడికి బోధచేశాడు. కాని ఆ బోధలకంటే కూడా రంగడిలోనే ఉన్న సహజబలాలే రాను రాను తక్కినవాళ్ళు అతనిచుట్టూ చేరేటట్టే చేస్తూవచ్చాయి. ఈ స్కూలుఆటల్లో మొదట్లో కొత్తదనంవల్ల రూల్సు తెలియని రంగడిఆట ఎబ్బెట్టుగావుండేది. కాని చలాకీతనం బైటపడి, ఆటల రూల్సు సర్వసాధారణంగా అలవాటుపడేటప్పటికి రంగడే తనకంటే నయమనిపించుకొని అల్లరిచేసిన కుఱ్ఱాళ్ళే అభినందనం చేసేస్థితికి వచ్చాడు.

తనలోమాత్రం మొదటినుంచీ ఉన్న సామాన్యత్వమే మిగిలిపోయింది.

ఎవళ్ళైనా మంచి దుస్తులు, కొత్త శుభ్రంగా దువ్విన తలా, ఫౌంటన్లమీద మోజూ చూపిచ్చేటప్పటికి తనూ తనతోపాటు కుఱ్ఱాళ్ళూ వాడిని కాకిగోల చేసి వదిలిపెట్టేవాళ్ళు. తన ఊళ్ళోనే

చిన్నప్పటినుంచి తనతో చదువుకుంటూవస్తూన్న కుర్రాళ్ళందరిదీ ఆ తత్వమే. ఈ పల్లెటూళ్ళనుంచి వచ్చిన కుర్రాళ్ళే ఆ సూట్లబూజులు చూపించేవాళ్ళు. రంగడుకూడా అల్లాగే అయి మళ్ళీ తమలో అల్లరి పడేటప్పటికి, తన మనస్సుకు మళ్ళీ కొంత ఆత్మవిశ్వాసం చిక్కింది. కాని దొంగచాటుగా వాళ్ళల్లో ప్రతివాడూ, తనకూ ఆ దుస్తులంటే బాగుండునని కోరుకుంటూన్నట్లే ఉండేది.

## 3

పట్టభద్రత్వము తప్ప మరేజీవిత భద్రత్వమూ ప్రసాదింపలేని బస్తీ వదిలి మహాపట్టణానికి పొట్ట చేత్తో పుచ్చుకొని వచ్చాడు. రైలు దిగినప్పటినుంచీ, కూలీలదగ్గరనుంచీ, తను పల్లెటూళ్ల వాళ్లంటే కూడా చూపించలేనంత నిరసనాన్ని చూపిస్తున్నారు. తన్ను మోసం చేసి, అల్లా చేసినవాళ్ళుకూడా తను మోసపడ్డ అర్భకత్వానికి, నీచ పురుగును చూసినట్లు చూస్తున్నారు.

రంగడు కనపడ్డాడు. రంగ డనుకోలేదు. ఆశ్చర్యంతో తెల్ల బోయి చూశాడు.

రంగడు "హల్లో! ఎప్పుడు వచ్చావు" అన్నాడు.

ఆదరణా, నిరాదరణాకూడా లేవు మాటలో. పల్లెటి రంగడికీ, బస్తీ రంగడికి, ఈ రంగడికి పోలికే కనబడటం లేదు. కాని ఆ కాస్త ఆశ్రయం వదులుకోలేక మాటలకు పాకులాడాడు. జనం రద్దీలో రంగడిని తోసుకొంటూ వచ్చిన ఒక సూటువాలా, రంగడికి వెంటనే క్షమాపణ చెప్పుకొని మళ్లీ కదుల్తూ వత్తిడిలో తనను తోసేస్తూ క్షమా పణచెప్పాల్సింది పోయి తీవ్రంగాచూస్తూ సాగిపోయాడు. రంగ డిది గమనించటమే లేదు.

కాఫీ తాగటానికి రంగడు పిలిచాడు. హోటల్‌లో ప్రవేశ స్తూంటేనే "అటు గాదు ఇటు" అని రంగడు దోవచెప్పాడు.

తినటంలో, త్రాగటంలో, నడవటంలో సన్నసన్నగా రంగడు నిషేధాలూ, అనుసరణీయాలూ చెప్పాడు. బస్తీలో మొట్ట మొదట తనకు శిష్యుడు, ఈనాడు తనకు పట్టణంలో పాఠాలు చెప్ప తున్నాడు. లోపల అశక్తక్రోధము కుమిలిస్తూంది. ఆ పాఠాలు క్షణ క్షణ గండాలుగా ఉన్నాయి.

"మళ్ళీ కనపడతా. అన్నట్టు ఎక్కడ దిగావు?"

నీ రూముకు వస్తా నన్నధైర్యం చాలకపోయింది. చివరికి సమయం దాటిపోతోందని కక్కూర్తిగా గతికాడు.

"నేను ఇంటర్వ్యూకి వెళ్లాలి. అంతవరకూ నీ గదికి వస్తాను."

ఇంటర్వ్యూకి తను తెచ్చుకొన్న లాగూ, కోటూ విడివిడిని తొడుక్కుంటే చీదరించుకొని రంగడు తన సూటు తీసియిచ్చాడు. నఖశిఖపర్యంతమూ ఎరువు తయారయింది. సాయంత్రం ఇంటర్వ్యూ అవగానే బ్రతికి బైటపడి రంగడిని కలుసుకొన్నాడు. సినిమాకు బయలుదేరారు.

స్త్రీ పురుషులు కలిసి కూర్చున్న సీట్లల్లో నూటంటే అను రింది కాని కూర్చోటానికి స్థాయీ చిక్కలేదు. బి. ఎ. చదివిన ఇంగ్లీషు ఉన్నా, సినిమాలో ఒక్కముక్క అర్థంకాలేదు. హాస్య దృశ్యం వచ్చినప్పుడు తన నవ్వు ఆ తరగతికంతకూ వెకిలిగా బైలు పడ్డది

మలుపుమలుపునా పట్టణం ముక్కలువిరగగొట్టింది. ఒక్క నాటితో పట్టం పేరుచెస్తే బీభత్సంకొల్పింది. ఆ అరుదులో రంగ డితో పోల్చుకొని చూస్తే అతనికీ తనకూ హస్తిమశకాంతరం కనపడ్డది. పల్లెటికుర్రాడు జీర్ణం చేసుకొన్న పట్టణం తనకు–బస్తీలో పుట్టిపెరి గినవాడికి కొరుకుడుపడక పళ్ళు విరిగేటట్టయింది.

రంగడు పుట్టింది పల్లెఅయినా, తక్కువతరగతిలో పుట్టినా, పల్లెకుండే స్తోమతతో జన్మించాడు. తరగతితర్వాత తరగతిగా మెట్లెక్కే అభ్యాసంలో జన్మించాడు. తను పుట్టిన బస్తీతరగతికి, మెట్టు ఎక్కగల దార్ఢ్యమే లేదు. ఉన్న స్థాయే ఉత్తమమనుకొని క్రిందికి చూసి ఈసడించటం తప్ప పైకిఎక్కడానికి బలంగాని తాహత్ గాని కలగలేదు. కొత్త వాతావరణాలను జీర్ణంచేసుకొని వాట్లల్లో జీర్ణమవగల స్వభావమే కనబడలేదు. ఆనాడు పల్లెకే పనికిరాలేదు, ఈనాడు పట్టణానికీ పనికిరాలేదు.

ఉండలేక ఊరుమొగం పట్టాడు. స్టేషనులో కూలీ మొదట అడిగినకూలీ ధరమార్చి డబ్బిచ్చాక పేచీపెట్టాడు. చివరికి రైలుకది లాక "పోడా గోంగూరై"అని ఈసడించాడు. వళ్ళంతా కుళ్ళిపోయి నట్లయింది.

ఇంటికి చేరి నిట్టూర్పు విడిచాడు.

పొరుగమ్మతో తన భార్య సగర్వంగా "మాఆయన పట్టణం వెళ్ళివచ్చా"రని చెప్పుకుంటూంది. ఇరుగాదివిడఆశ్చర్యవిభ్రమాలు తన లోపలి దుఃఖానికి బైటసంతోషాన్ని పూతపూశాయి.

